# 8

# "ఇంటింటికీ ఓ అమ్మ"

అదో ఇల్లు! మనుషులు ఉంటున్నారు కాబట్టి ఇల్లు అనాలి గానీ, న్యాయంగా గూడు అనొచ్చు. అంతా కలిపి ఆరొందల చదరపు అడుగులు. అందులోనే హాలు, రెండు పడక గదులు, వంటిల్లు, బాత్‌రూమ్, అంట్లు తోముకునేందుకు, బట్టలు ఆరేసుకునేందుకు చిన్న బాల్కనీ.

లిఫ్ట్ సౌకర్యం కూడా లేని ఆ మేడమీద మూడో అంతస్థు. ఇంట్లో ప్రస్తుతం వాతావరణం వేడెక్కి ఉంది. ఆ ఇంటి ఇల్లాలు రమ చిరాగ్గా ఉంది. అందులో ఆశ్చర్యం ఏమీ లేదు. ఎప్పుడో అరుదైన సందర్భాలలో తప్పించి, రమ చిరాగ్గానే ఉంటుంది. అలా ఉందంటే రమ తప్పేం లేదు.

తెల్లవారకుండానే లేచి వంటా వార్పూ చేసుకుని, వెన్నులోంచి వణుకు పుట్టించేంత భయంకరమైన ట్రాఫిక్‌లో నత్తనడక నడిచే సిటీబస్సులో, ఒంటికాలి మీద నిలబడి ఏడెనిమిది కిలోమీటర్లు ప్రయాణం చేసి ఆఫీసుకెళ్ళి ఆరింటిదాకా పనిచేసి, మళ్ళీ నిలబడి బస్ ప్రయాణం చేసి, మూడంతస్థులూ ఎక్కి కొంపకి చేరి బట్టలు ఉతుక్కుని, అంట్లు తోముకుని, వంట చేసుకునే ఏ ప్రాణి కయినా విసుగ్గానే ఉంటుంది. ఏ మాటకామాటే చెప్పుకోవాలి.

ఆ స్థితిలో ఉంటూ బతుకు బండి లాక్కొచ్చే చాలామంది ఇల్లాళ్ళ లాగానే రమకీ, భూదేవికి ఉన్నంత ఓర్పు ఉంది. ఆ ఓర్పే లేకపోతే హీనపక్షం రోజుకి రెండు హత్యలు చేసేసేదే. ఓర్పు ఉంది కాబట్టి, ఏం చేస్తాం జీవితం అంటే ఇంతే మరి అని సర్ది చెప్పుకుంటుంది. ఇంకా విసుగేస్తే భగవన్నామస్మరణ చేసుకుంటుంది. ఇంకా విసుగేస్తే బయటకు విసుక్కుంటుంది.

ప్రస్తుతం అదే జరిగింది. "నా ఖర్మ. నా దరిద్రం! చచ్చేదాకా ఇంతే నా బతుకు. ఎంత వద్దనుకున్నా తప్పటం లేదు. వెధవ పీడాకారం!" అని విసుక్కుంది. రమకి ఒక కూతురుంది. దానికి ఐదేళ్ళు. పేరు మానస. ఏ ముహూర్తాన దానికి ఆ పేరు పెట్టామోగానీ సార్థక నామధేయురాలు. దాని సందేహాలు తీర్చేసరికి మాకు నీరసం వస్తోంది. మా నస అంటాడు రమ భర్త రాజా. ఆ నస ఇంట్లోనే ఉంది.

తల్లి విసుక్కోవడం చూసి- "ఎందుకు? ఎందుకలా కోప్పడతావ్? నేనేం చేసాను? హోంవర్క్ చేసేసాగా!" అని వెంటపడి పీక్కుతింటోంది. ఆ నస భరించలేక "నోరెత్తావంటే తంతాను. పో... ఇక్కడి నుంచి..." అని విసుక్కుంది రమ. దాంతో బెదిరిపోయి వెళ్ళి గదిలో కూర్చుంది.

మానసంటే చిన్నపిల్ల కాబట్టి అర్థం కాలేదు గానీ, గిరికి అర్థం అయిపోయింది. ఆవిడ మాటలు వినిపిస్తూనే ఉన్నాయి. వినిపించకపోవడానికి అదేమీ ఇంద్రభవనం కాదు కదా! అతనికీ ఉక్రోషం వచ్చింది. ఉన్నపాటున లేచి ఇంట్లోంచి వెళ్ళిపోదాం అనిపించింది. అలా చేస్తే ఏమవుతుందో అతనికి బాగా తెలుసు! అవసరం తనది. ఒకమాట అనే హక్కు ఆవిడకుంది. పౌరుషానికి పోయే స్థితి తనకు లేదు. అందుకే విననట్లు ఉండిపోయాడు. రమకి విసుగేసిందంటే కారణం చిన్నదే. వడ్లగింజలో బియ్యపు గింజ.

రమ, రాజా చాలా సామాన్యమైన కుటుంబం నుంచి వచ్చారు. వాళ్ళది గుంటూరు జిల్లాలోని ఓ కుగ్రామం. ఇద్దరూ చెరో ప్రైవేటు కంపెనీలో పనిచేస్తున్నారు. వచ్చే జీతాలతో గుట్టుగా సంసారం చేసుకుంటున్నారు. ఒక్క బిడ్డ చాలనుకున్నారు. ఇద్దరూ సహృదయులు, సౌమ్యులు.

వాళ్ళది పల్లెటూరు కాబట్టి చుట్టాల తాకిడి ఎక్కువే. వైద్యానికి, ఉద్యోగానికి, పెళ్ళి సంబంధాల కోసం ఎవరో ఒకరు వస్తూనే ఉంటారు. వీళ్ళ ఆర్థికస్థితి అందరికీ తెలుసు. కాబట్టి, ఉన్న నాలుగు రోజులూ అన్నివిధాలా సాయం చేస్తారు. వాళ్ళ అవసరం తెలుసు కాబట్టి, వీళ్ళూ ఉన్నంతలో మర్యాదగానే చూసి సాగనంపుతారు. పరిస్థితి చెయ్యి దాటితేనే ఇటువంటి గొడవలు వస్తాయి. ప్రస్తుతం పరిస్థితి కాస్త విషమంగానే ఉంది.

గిరి, రాజారావుకి మేనల్లుడు. అంటే స్వంత మేనల్లుడు కాదు, రాజారావుకి పెద్ద తాతగారి కూతురి కొడుకు. బంధుత్వం అయితే దూరమే గానీ దగ్గర సంబంధా

లున్నాయి. గిరికి ఇరవై ఏళ్ళు. డిగ్రీ పాసయ్యాడు. ఇంకేవో కంప్యూటర్ కోర్సులు కూడా చేసాడు. పల్లెటూళ్ళో ఉద్యోగాలు ఉండవు కాబట్టి, రాజారావు దగ్గరికి పంపించారు. ఐదు కిలోల బియ్యం, నాలుగు కిలోల చింతపండు, సీసాడు ఆవకాయ, మానస కోసం కాసిని కొబ్బరి లడ్డూలూ ఇచ్చారు రాజాకివ్వమని. చేతి ఖర్చులకి గిరికి డబ్బిచారు. వచ్చిన వారానికే గిరికి ఉద్యోగం దొరికింది. జీతం మూడువేలు. టిఫెనూ, అన్నం వాళ్ళే ఇస్తారు. రాత్రి వస్తూ భోజనం బయటే చేసి వచ్చేవాడు గిరి.

"రూం చూసాను. ఫస్టుకి ఖాళీ అవుతుందిట! అక్కడికి మారిపోతాను అన్నాడు". రమ, రాజా ఊపిరి పీల్చుకున్నారు. చెప్పాలంటే గిరి, వాళ్ళకేం భారం కాదు. పొద్దున ఒక కప్పు టీ తాగుతాడు అంతే! పనుల్లో కూడా సాయం చేస్తాడు. కానీ పైకి చెప్పుకోలేని ఇబ్బందులు కొన్ని ఉంటాయి. వాళ్ళు ముగ్గురే అయితే మానస చిన్నగదిలో పడుకుంటుంది. ఎవరైనా వస్తే తల్లిదండ్రుల దగ్గరే పడుకోవాలి మరి! భార్యాభర్తలిద్దరూ ఫస్టు తారీకు కోసం ఎదురుచూస్తున్నారు.

ఫస్టు వచ్చింది. రెండువేలు మాత్రం చేతిలో పెట్టి, రేపటినించీ పన్లోకి రావద్దన్నారు గిరిని. ముగ్గురికీ నెత్తిన పిడుగు పడినట్లు అయింది. "ఈ టెంపరరీ ఉద్యోగాలింతేరా! మరోటి దొరుకుతుందిలే!" అన్నాడు రాజా. ఉద్యోగం పోగొట్టుకున్న గిరిని పట్టుకుని రూమ్‌కి ఎప్పుడు మారతావ్ అని మాత్రం అడగలేకపోయాడు. గిరి తండ్రికి ఈ విషయం చెప్తే "నాకూ కటకటగా ఉంది, వాళ్ళింట్లోనే ఉండు ప్రస్తుతానికి. భోజనం మాత్రం బయటే తిను" అన్నాడు. రమకి ఓర్పు నశించిపోతోంది. ఇంటికొచ్చిన అతిథి ఫలానప్పుడు వెళ్ళిపోతాడంటే అదో ధైర్యం. ఇలా దైవాధీనం వ్యవహారం అయితే కష్టం కాదా! ప్రతిరోజూ రాగానే గిరివంక ఆశగా చూస్తుంది. తల తిప్పుకుంటాడు గిరి. పదిహేనురోజులు గడిచిపోయాయి.

ఆ వేళ రమకి ఒంట్లో బాగోలేదు. ప్రతి నెలా అంతే! కాళ్ళు చచ్చుబడినట్లు ఉంటుంది. కాళ్ళు ఈడ్చుకుంటూ ఇంటికొచ్చింది. గిరి మానసతో ఫుట్‌బాల్ ఆడుతూ కనిపించాడు. యథాప్రకారం తల తిప్పుకున్నాడు. పైకొచ్చింది. బలవంతాన టీ పెట్టింది. మానసకి హార్లిక్స్ ఇచ్చింది. పొద్దున కూరా, పప్పూ చేసే ఓపిక లేక ఇంతన్నం వండి, నిమ్మకాయ పులిహోర చేసేసింది. రాజా ఆ పూట భోజనానికి రానని చెప్పేసాడు. ఏదో పార్టీ ఉందట! తనకీ, కూతురికీ ఆ పులిహోర సరిపోతుంది.

వంట పనిలేదు. కాబట్టి పడుకుంది కాసేపు. ఏడున్నరకి లేచి బట్టలుతకడం మొదలు పెట్టింది. సామాన్యంగా ఆ వేళకి గిరి బయటికి వెళ్తాడు భోజనానికి. ఆ వేళ వెళ్ళలేదు. ఉద్యోగం పోయాక, నాలుగైదుసార్లు రాత్రిపూట ఇంట్లోనే భోజనం చేసాడు. ఇప్పుడు తను ఉండిపోతే మళ్ళీ వండాలి. అందుకే బాహాటంగా విసుక్కుంటోంది.

గిరికి ప్రాణం చచ్చిపోతోంది. చేతిలో యాభై రూపాయలు మాత్రమే ఉన్నాయి. కిందటిరోజు పొద్దున రోడ్డు పక్కన బండిమీద పప్పూ, అన్నం కొనుక్కు తిన్నాడు. రాత్రి రెండు అరటిపళ్ళు తిన్నాడు. పొద్దుటినుంచీ ఏమీ తినలేదు. తండ్రికి ఫోన్ చేస్తే నాల్రోజుల్లో పంపిస్తాను, అందాకా సర్దుకో అన్నాడు. పంపేదాకా ఆ యాభై రూపాయలే గతి. తిన్నా తినకపోయినా బయటికి వెళ్ళొస్తే అత్తయ్యా శాంతిస్తుంది. కానీ మూడంతస్థులూ దిగి వెళ్ళి వచ్చే శక్తిలేదు. అందుకే విననట్లు ఊరుకున్నాడు. తన ఇబ్బంది అర్థం చేసుకుని బయటికి వెళ్ళి తినొస్తాడేమో అని రమ ఆశ.

రాజా వచ్చేసాడు. "ఏరా ఏమిటి విశేషాలు?" అని అడిగాడు.

"ఏమీ లేవు మామయ్యా!" దీనంగా చెప్పాడు గిరి. "సర్లే చూద్దాం! ఇందాక పార్టీలో ఒకాయన కనిపించాడు. నీ గురించి చెప్పాను. అడ్రస్ ఇస్తాను, రేపోసారి వెళ్ళు" అన్నాడు రాజా.

తండ్రి గొంతు విని పరిగెట్టుకుని చంకనెక్కేసింది మానస. కూతుర్ని ముద్దులాడాడు.

"అన్నం తిన్నావా?" అడిగాడు.

"అప్పుడేనా? నా ప్రాణం విసిగించి అప్పుడు తింటుంది" విసుగ్గా చెప్పింది అక్కడికొచ్చిన రమ.

"రమా! అలా ఉన్నావేం? ఒంట్లో బాగోలేదా?" ఆదరంగా అడిగాడు.

"నాకేం మాయరోగం! బాగానే ఉన్నాను" విసురుగా చెప్పింది. భార్య మూడ్ బాగోలేదని గ్రహించాడు.

"ఏరా నువ్వు భోజనం చేసావా?" గిరిని అడిగాడు.

"మధ్యాహ్నం చాలా ఆలస్యంగా తిన్నా మామయ్యా! ఆకలి లేదు" చెప్పాడు గిరి.

"రమా నువ్వు తినేసి పడుకో. దీనికి నేను తినిపిస్తానులే" అన్నాడు రాజా.

"నాకిప్పుడు ఆకలిగా లేదు, తర్వాత తింటాను" అనేసి గదిలోకి వెళ్ళిపోయింది. గిరి కూడా రెండో గదిలోకి వెళ్ళాడు. రాజా వంటింట్లోకి వెళ్ళి పులిహోర తెచ్చి కూతుర్ని పిలిచాడు. మానస వచ్చింది.

"కథ చెప్తేనే తింటా!" అంది. "ఏం కథ చెప్పనూ?" అడిగాడు.

"నీ చిన్నప్పటి కథ చెప్పు" అంది. ఈ తండ్రీ కూతుళ్ళకి అది అలవాటే. పురాణ గాథలతో బాటు జీవితంలోని సంఘటనలు కథలుగా చెప్తే, మన స్థితిగతులు ఎటువంటివో పిల్లలకి తెలుస్తాయి అంటాడు రాజా. ఆ వేళ తన చిన్నప్పటి కథే మొదలుపెట్టాడు.

"నాన్నకి పదిహేడేళ్ళ వయసుంటుంది. అప్పుడే ఇంటర్ పాసయ్యాడు నాన్న. డిప్లొమోలో సీటు వచ్చింది. కానీ పాపం తాతయ్య దగ్గర డబ్బులేదు. ఫీజు కట్టాలి. గడువు దగ్గరపడుతోంది. అప్పుడు తాతయ్యేం చేసారంటే– నాన్నని వాళ్ళ అన్నయ్యా వాళ్ళింటికి అంటే నాన్నా వాళ్ళ పెద్ద తాతయ్య ఇంటికి పంపించారు. నాన్నేమో వెళ్ళి పెద్ద తాతయ్యని డబ్బు అడిగారు. ఆ పెద్ద తాతగారి దగ్గర కూడా డబ్బు లేదు. నా దగ్గరా లేదురా! ఇంకెవరి దగ్గరైనా ప్రయత్నించు అన్నారు. అప్పుడు ఆ తాతయ్యగారి భార్య ఏమందో తెలుసా?" చెప్తున్నాడు.

"తెలుసు నాన్నా నాకు తెలుసు!" అని అందుకుంది మానస.

"తెలుసా! తెలిస్తే చెప్పు..." అన్నాడు రాజా.

"నా ఖర్మ... నా దరిద్రం... నా బ్రతుకంతా ఇంతే! వెధవ పీడాకారం అని నాన్నని విసుక్కుంది" చెప్పింది మానస. రాజా, పక్కగదుల్లో ఉన్న రమ, గిరి ముగ్గురూ అదిరిపడ్డారు.

రాజాకి నెమ్మదిగా పరిస్థితి అర్థం అయింది. రమ ఎందుకంత చిరాగ్గా ఉందో, గిరి మొహం చాటేసుకుని ఎందుకు తిరుగుతున్నాడో అర్థమయింది.

"ఏం నాన్నా అంతే కదూ!" తండ్రి ఏమీ సమాధానం చెప్పక పోయేసరికి రెట్టించింది మానస. కూతుర్ని దగ్గరకు తీసుకున్నాడు.

"కాదమ్మా! అలా అన్లేదు. పాపం ఎంత అవసరం ఉండి వచ్చాడో. నా కడియాలూ, మీ కంచం ఎక్కడైనా పెట్టి డబ్బు తీసుకురండి. పంట అమ్మగానే

విడిపించుకుందాం. ఇప్పుడు ఈ వస్తువుల కంటే డబ్బు ముఖ్యం. ఫీజు కడితే వాడు చదువుకుంటాడు. చదువుకుంటే వాడి భవిష్యత్తు బాగుపడుతుంది. రేపు మనకు అవసరం అయితే ఇంకెవరినైనా అడగమా? వాళ్ళు కాదంటే మనకెంత బాధగా ఉంటుందీ! అంది పెద్దమామ్మ" చెప్పాడు.

"మీ పెద్దమామ్మ చాలా మంచిది కదూ నాన్నా!" అంది మానస.

"అవునమ్మా! నాకే కాదు, ఉన్నంతలో చాలామందికి సాయం చేసారు వాళ్ళు" అన్నాడు.

రమకు ఎందుకో ఏడుపొచ్చింది. దిండులో మొహం దాచుకుని ఏడిచింది. మానస అన్నం తిని నిద్రపోయింది. కూతుర్ని పడుకోబెట్టడానికి గదిలోకి తీసుకొచ్చాడు. మంచం మీద పడుకోబెట్టి "రమా లే... లేచి అన్నం తిను" అని భార్యని లేపాడు. గభాల్న లేచింది రమ. మొహం కడుక్కుని వంటింట్లోకి వెళ్ళి గోధుమపిండి తడిపింది. పుల్కాలు చేసింది. రెండో గదిలోకి వెళ్ళి-

"గిరీ! లే... అన్నం తిందాం రా!" అంది.

గిరికి ఆకలి ఒక్కసారిగా విజృంభించింది. చివాల్న లేవబోయి, "వద్దులే అత్తయ్యా ఆకలి లేదు" అన్నాడు. "ఆకలి ఉన్నంతే తిను. చపాతీలు చేసాను. రా! చల్లారేలోగా తినేద్దాం!" అంది ఆదరంగా. ఇంకేం మాట్లాడకుండా వచ్చాడు. ఇద్దరికీ కంచాల్లో పెట్టి తెచ్చింది. ఆకలి లేదన్న గిరి ఆవురావురుమని తింటుంటే రమకి కడుపులో దేవినట్లు అయింది. కళ్ళనీళ్ళు తిరిగాయి. తలపక్కకు తిప్పేసుకుంది. ఇద్దరూ భోజనం చేసేస్తారు. వంటిల్లు సర్దడంలో అత్తయ్యకి సాయం చేసాడు గిరి. పన్లన్నీ పూర్తి చేసుకుని గదిలోకి వచ్చింది రమ. భర్త పక్కనే చోటు చేసుకుని పడుకుంది, "ఏవండీ! నేను చాలా చెడ్డదాన్ని కదూ!" అంది దీనంగా. భార్యను దగ్గరగా తీసుకుని ఆదరంగా తల నిమిరాడు. "కాదు... నువ్వు కూడా అమ్మవే! ఈ ప్రపంచంలో ఏ అమ్మా చెడ్డది కాదురా!" అన్నాడు అతి ప్రేమగా. ❑

*చిత్రమాస పత్రిక- కథల అనుబంధం, జూన్ 2010*